క్లుప్తంగా

ప్రజలకు మాజీ ఎమ్మెల్యే దీపావళి శుభాకాంక్షలు


మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం: పోలవరం నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ దీపావళి పండుగను ప్రతీ ఒక్కరూ తమ కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవాలన్నారు. ప్రజలకు సకల శుభాలు, సిరి సంపదలు, సౌభాగ్యాలు, విజయాలు కలగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రతీ ఇంటా ఆనందకాంతులు విరజిల్లాలని బాలరాజు కాంక్షించారు. అలాగే బాణసంచా సామాగ్రి కాల్చే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

బాబ్ మేళాలో 11 మంది ఎంపిక

బుట్టాయగూడెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించారు. కార్యక్రమంలో 20 మంది యువతీ, యువకులు హాజరు కాగా వీరిలో 11 మందిని ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కుసుమ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి కె.ప్రవీన్, కో–ఆర్డినేటర్ నాగరాజు, పోట్లం, లగ్జరీ ల్యాండ్ లార్డ్ యూనివర్సల్ ప్రాజెక్ట్ కంపెనీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపడి విద్యుత్ పరికరాలు దగ్ధం

ద్వారకాతిరుమల: మండలంలోని జి.కొత్తపల్లిలో బుధవారం పిడుగు పడటంతో పలు ఇళ్లలోని ఎలక్ట్రానిక్ వస్తువులు, విద్యుత్ మీటర్లు దగ్ధమయ్యాయి. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. వివరాల ప్రకారం. గ్రామంలోని గంజి వెంకటేష్ ఇంటి సమీపంలోని ఒక కొబ్బరి చెట్టుపై వర్షం కురుస్తున్న సమయంలో పిడుగు పడింది. దీంతో కొబ్బరి చెట్టు మధ్యలో చీలిపోయింది. అలాగే పరిసర ప్రాంతాల్లోని నివాస గృహాల్లో ఉన్న ఫ్రిజ్‌లు, టీవీలు, విద్యుత్ మీటర్లు, ఇలా పలు రకాల ఎలక్ట్రానిక్ వస్తువులు దగ్ధమయ్యాయి.

మినీ గోకులాలు మంజూరు

టి.నరసాపురం: మండలానికి మినీ గోకులాలు మంజూరయ్యాయని ఎంపీడీవో ఎస్.వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి 33 మినీ గోకులాలు మంజూరు కాగా, వాటిని సబ్సిడీపై అందిస్తామన్నారు. మినీ గోకులాలు (పశువుల షెడ్లు) 10 మీటర్ల పొడవు, 10 మీటర్ల వెడల్పు, 10 మీటర్ల ఎత్తు ఉండేలా నిర్మించాలని, పశువుల షెడ్డుకు రూ.2.30 లక్షలు ప్రభుత్వం నిర్ణయించగా, వాటిలో రైతు వాటాగా రూ.23 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మిగిలిన రూ.2.07 లక్షలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఆసక్తి గల రైతులు స్థానిక పశు వైద్యాధికారిని సంప్రదించాలని సూచించారు.

దాడి కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వృద్ధుడిపై దాడి చేసిన నేరంపై యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వై.మంగయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఉప్పలమెట్టకు చెందిన కట్టా భోగేశ్వరరావు తన కోడిపెట్ట కోసం వెళుతుండగా, భోగేశ్వరరావును అదే ప్రాంతానికి చెందిన ముంగా దుర్గాప్రసాద్ అమర్యాదగా ఏకవచనంతో పిలిచాడన్నారు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగిందని, దుర్గాప్రసాద్ రాయితే భోగేశ్వరరావుపై దాడి చేశాడన్నారు. గాయపడిన భోగేశ్వరరావును అతని కుమారుడు స్థానిక ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారన్నారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం, భోగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

ముమ్మరంగా వేగ నియంత్రణ చర్యలు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ప్రమాదాలకు కారణమవుతన్న ప్రాంతాన్ని బ్లాక్‌స్పాట్‌గా గుర్తించి పోలీసు అధికారులు ప్రమాద నివారణ చర్యలు, వేగ నియంత్రణ చర్యలు చేపట్టారు. జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర ఆదేశాల మేరకు సీఐ వి.కృష్ణబాబు ఆధ్వర్యంలో ఎస్సై షేక్ జబీర్, ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి రంబుల్ స్ట్రిప్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్సై జబీర్‌తో పాటు, పోలీసు సిబ్బంది, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

పేదలకు ఆర్థిక సాయం

కొయ్యలగూడెం: ఎల్ఎస్ఎం సంస్థ ఆధ్వర్యంలో400 మంది పేదలకు సహాయ కార్యక్రమాలు నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ ఎం.దేవ సహాయం, కోశాధికారి ప్రేమకుమారి దంపతుల ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం రోడ్‌లోని సంస్థ ప్రాంగణంలో బహిరంగ సమావేశం నిర్వహించి సేవా కార్యక్రమాలు అమలు చేశారు. వారం రోజుల పాటు నిర్వహించిన పలు అంశాల్లో ప్రతిభ కనపరిచిన వారికి బహుమతులను అందజేశారు. సెక్రటరీ పోతుల ఐజాక్, జాయింట్ సెక్రెటరీ దొప్పసాని కనకరాజు, తాళ్లూరి కృషివరరావు, చాపల సుబ్బలక్ష్మి, మాత విజయరామరాజు సంస్థ సభ్యులు వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ల తొలగింపు


రెడ్డి గణపవరంలో విద్యుత్ మీటర్‌ను తొలగించిన దృశ్యం (ఫైల్)


విద్యుత్ మీటర్లు తీసుకెళ్లడాన్ని నిరసిస్తూ ధర్నా చేస్తున్న దళితులు(ఫైల్)

- దళితులపై కన్నెర్రజేసిన విద్యుత్‌శాఖ అధికారులు
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ ఇళ్లకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితం

బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డిగణపవరంలో నివసిస్తున్న దళితులపై విద్యుత్‌శాఖ కన్నెర్రజేసింది. గ్రామంలోని దళితపేటలోని వారంతా కూలీనాలీ చేసుకొని జీవనం సాగించే వారే. అయితే ఉన్నటుండి వారికి విద్యుత్ సమస్య వచ్చి పడింది. గత ఐదేళ్లుగా ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం కల్పించిన 200 యూనిట్ల ఉచిత పథకాన్ని సద్వినియోగం చేసుకుంటూ వచ్చారు. అయితే ఒక్కసారిగా ఉన్నట్టుండి విద్యుత్ బిల్లుల వేళల్లో దళితుల ఇళ్లకు బిల్లులు వచ్చాయి. దీంతో బిల్లులు చూసి దళితులు అవాక్కయారు. గత రెండు రోజులుగా బకాయిలు చెల్లించాలంటూ స్థానిక లైన్‌మెన్లు దళితులపై ఒత్తిడి చేశారు. వేలల్లో వచ్చిన బిల్లులు చెల్లించడానికి కొంత సమయం కావాలని కోరినప్పటికీ ఆదివారం లైన్‌మెన్లు ఆరుగురి దళితుల ఇళ్లలోని విద్యుత్ కనెక్షన్లు కట్ చేసి మీటర్లు తీసుకెళ్లిపోయినట్లు దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు రాత్రంతా ఇబ్బందులు పడ్డారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లుగా ఉచితంగా కరెంటు వినియోగించుకున్న తమకు అర్థాంతరంగా వేలల్లో బాకాయిలు ఎందకు వచ్చాయో అర్థం కావడం లేదని దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో ఇలా

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో నివసిస్తున్న అర్హులైన వారికి 200 యూనిట్ల వరకూ ఉచితంగా విద్యుత్ గృహాలకు వినియోగించుకొనే అవకాశం కల్పించింది. అంతకు ముందు టీడీపీ పాలనలో 100 యూనిట్లు మాత్రమే ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ గృహాలకు పరిమితి ఉండేది. దానిని రెట్టింపు చేస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జీవో ఇచ్చింది. అయితే ఐదేళ్లలో ఎప్పుడూ కలగని కష్టం దళితులకు ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఎదురైందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం ఇస్తున్న ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అలాగే తమ ఇంటికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని మహిళలు కేవీపీఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు.

బతిమలాడినా పట్టించుకోలేదు



మా ఇంట్లో చిన్న పిల్లలు, వృద్ధులు ఉన్నారని కరెంట్ కట్ చేయొద్దని ఎంత బతిమలాడినా పట్టించుకోకుండా లైన్‌మెన్లు మా ఇంటి కరెంట్ కట్ చేసి మీటర్లు తీసుకెళ్లిపోయారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఎన్నడూ మాకు ఈ పరిస్థితి రాలేదు.

నేమవరపు సీత, రెడ్డి గణపవరం, బుట్టాయగూడెం మండలం

గత ప్రభుత్వంలో అమలు చేశారు.



ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ 200 యూనిట్ల వరకూ గత ప్రభుత్వం ఉచితంగా అందించింది. ఐదేళ్ల కరెంట్ బిల్లులు కట్టాల్సిన అవసరం రాలేదు. కూటమి ప్రభుత్వంఅధికారంలోకి వచ్చిన తరువాత కూడా ఉచిత పథకం అమలు చేస్తారనుకున్నాం. కాని ఇప్పుడు వేలల్లో బిల్లులు చూపిస్తున్నారు. బిల్లులు కట్టడానికి గడువు అడిగినా పట్టించుకోకుండా కరెంట్ కట్ చేసి మీటర్లు తీసుకెళ్లిపోయారు.

బర్లా ప్రశాంతి, రెడ్డి గణపవరం, బుట్టాయగూడెం మండలం

ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ అమలు చేయాలి



కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు తప్పనిసరిగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం అమలు చేయాలి. బకాయిల పేరుతో దళితులను వేధించడం సరైన పద్ధతి కాదు. రెడ్డిగణపవరంలో దళితులపై దౌర్జన్యం చేసి కరెంట్ కట్ చేసి మీటర్లు పట్టుకుపోవడం శోచనీయం. వెంటనే తిరిగి వాటిని పునరుద్ధరించాలి.

అందుగుల ఫ్రాన్సిస్, కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి, బుట్టాయగూడెం

నాణ్యతా ప్రమాణాలపై దర్యాప్తు చేస్తాం

ఎంపీడీవో కిరణ్‌కుమార్

సాక్షి ఎఫెక్ట్

కొయ్యలగూడెం: మండలంలో అమలవుతున్న అభివృద్ధి పనుల్లో వచ్చిన ఆరోపణలపై ఉన్నతాధికారులతో కలిసి దర్యాప్తు నిర్వహిస్తామని ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో బుధవారం సాక్షి పత్రికలో ప్రచురించిన అభివృద్ధి పనులకు నాణ్యత లేని ఇసుక కథనాన్ని వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు ప్రశ్నించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత లేకపోతే ప్రజలు మీడియా ద్వారా లేదా నేరుగా ఫిర్యాదు చేసే హక్కు ఉందని అందుకు వారిని నిందించే అధికారం అధికారులకు లేదన్నారు. ఆరోపణలు చేస్తున్న వారిని లక్ష్యంగా చేసుకోకూడదన్నారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా తమ గ్రామాల్లో అమలు కావలసిన అభివృద్ధి పనులు సత్వరమే చేపట్టాలని సర్పంచులు, ఎంపీటీసీలు అధికారులను కోరారు.

ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవాలు



రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

చింతలపూడి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ఐక్యత కోసం పరుగు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని జాతీయ సమైక్యతా దినోత్సవంగా నిర్వహించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎన్‌జేకే నరేంద్ర కుమార్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ ఏవీఆర్, అధ్యాపకుడు బి.శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కామవరపుకోట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం పొలిటికల్ సైన్స్, ఎన్ఎస్ఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యతా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

కౌలు రైతుకు రూ.10 లక్షల నష్టం


నాటు పొగాకు కలప దగ్ధమైన దృశ్యం

లింగపాలెం: గ్రామానికి చెందిన కౌలు రైతు మట్టా రామారావుకు రూ.10 లక్షలు నష్టం వాటిల్లింది. దీనికి సంబంధించి బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 25 ఎకరాల్లో సాగు చేసేందుకు నాటు పొగాకు నారుమళ్లు కౌలు రైతు మట్టా రామారావు సిద్ధం చేశారు. ఇదే క్రమంలో నాటు పొగాకు సాగుకు అవసరమైన కలపను సిద్ధం చేసుకున్నాడు. ఈ కలపను రెండు ప్రాంతాల్లో గుట్టలుగా ఏర్పాటు చేసుకున్నారు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పొగాకు కలపను దగ్ధం చేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ధర్మాజీగూడెం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బుధవారం ఉదయం రామారావు పొలానికి వెళ్లగా, 25 ఎకరాల్లో సాగు చేసేందుకు సిద్ధంగా ఉంచిన పొగాకు నారుమళ్లు మాడిపోయి కనిపించాయి. రాత్రి జరిగిన ఘటనలోని దుండగులే నారుమడిపై కలుపు మందును పిచికారీ చేసి ఉంటారని రామారావు పేర్కొన్నాడు.

విద్యుత్ చార్జీల మోతపై ఆందోళన


సీపీఐఎంఎల్ మాస్‌లైన ప్రజాపంథా జనరల్ బాడీ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

వేలేరుపాడు: ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై వేసిన రూ.6072కోట్ల విద్యుత్ బిల్లుల భారాన్ని కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి ఎస్‌కే గౌస్ తెలిపారు. బుధవారం సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజా పంథా ఏలూరు జిల్లా నిర్మాణ జనరల్ బాడీ సమావేశం వేలేరుపాడులో నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రజల సమస్యలపై పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు సిరికొండ రామారావు, గడ్డల ముత్యాలరావు, బాసినేని సత్యనారాయణ, కట్టం వీరా స్వామి, కట్టము ముత్యాలరావు, సోయం చంద్రరావు, ఎం.మల్లేష్, కె.కళ్ళయ్య, పెరుమాల్ల శ్రీను, మేడేపల్లి సర్పంచ్, ఎంపీటీసీ కత్తాం రాంబాబు, తుర్రం తమ్మయ్య, నార్లవరం సర్పంచ్ ఎం.రంగమ్మ, ఎంపీటీసీ కె.రత్తమ్మ, తిరుమలాపురం సర్పంచ్ సోడే విజయ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

చింతలపూడి: మండలంలోని నాగిరెడ్డిగూడెంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో 5 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని 500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. అదే విధంగా కామవరపుకోట మండలం, ఆడమిల్లి గ్రామంలో అనధికారికంగా మద్యం అమ్ముతున్న అరమల్ల నాగేశ్వరరావు అనే వ్యక్తిని అరెస్ట్ చేసి 17 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో సీఐ పి.అశోక్, ఎస్సైలు అబ్దుల్ ఖలీల్, ఆర్‌వీఎల్ నరసింహారావు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్లను నియమించాలి

లింగపాలెం: సీపీఎస్ రద్దు చేసి నెలవారీ ప్రమోషన్ల ప్రక్రియను పునరుద్ధరించాలని పీఆర్‌టీయూ ఏలూరు జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. లింగపాలెం మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ధర్మాజీగూడెం, బాలికల హైస్కూల్, కలరాయనగూడెం, రంగాపురం, సింగగూడెం, కొత్తపల్లి, గోకవరం హైస్కూళ్ల నందు బుధవారం పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతీ హైస్కూల్ నందు కంప్యూటర్ల నియామకం చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ సుబ్బారావు, మండల అధ్యక్షులు కె.సూర్యనారాయణ, పి.రంగారావు, బెజవాడ ధర్మారావు, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చదరంగం పోటీలకు కార్తీక ఎంపిక


బహుమతి గెలుచుకున్న ఉమ్మడి పశ్చిమగోదావరి టీమ్

జంగారెడ్డిగూడెం: ఈ నెల 29న బాపట్లలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్–17 బాలికల విభాగంలో చదరంగంలో నిర్వహించిన పోటీల్లో పట్టణానికి చెందిన హంస చెస్ అకాడమీకి చెందిన కేఎస్ఎస్ కార్తీక ప్రతిభను కనబరిచి టాప్–5 స్థానంలో విజయం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల నుంచి హాజరైన కార్తీక వచ్చే నెల 15 నుంచి 21 వరకు మధ్యప్రదేశ్‌లో జాతీయ స్థాయిలో నిర్వహించనున్న చదరంగం పోటీల్లో పాల్గొననుంది. ఈ సందర్భంగా దివ్యాస్ చెస్ అకాడమీ కోచ్ అయినపర్తి సరళాదేవి, హంస కోచ్‌నాగు, పట్టణ ప్రముఖులు బాలికలను అభినందించారు.

రావి ఆకుపై వల్లభాయ్ పటేల్ ఆకృతి


రావి ఆకుపై సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆకృతి

కామవరపుకోట: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా మండలంలో రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన స్కాట్స్, గైడ్స్ విద్యార్థిని శ్రావణి, ఉపాధ్యాయులు బిరుదుగడ్ల నాగేశ్వరరావు ఇచ్చిన శిక్షణతో రావి ఆకుపై సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆకృతిని చిత్రించి పలువురుని అబ్బురపరిచింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉమ్మడి భీమరాజు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు విద్యార్థినిని అభినందించారు.

మాదిగ మహాసభ పోస్టర్ల ఆవిష్కరణ

కొయ్యలగూడెం: మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత్ ఎంప్లాయీస్, (మేడ్) ఫర్ యూనిటీ రాష్ట్ర 7వ మహాసభను మాదిగ సోదరులు విజయవంతం చేయాలని ఏలూరు జిల్లా మేడ్ అధ్యక్షుడు లాగు జయరాజ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం మేడ్ ఫర్ యూనిటీ రాష్ట్ర ఏడవ మహాసభ కరపత్రాలను అసోసియేషన్ సభ్యులు విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కొక్కిరిపాటి మధు, పోలవరం నియోజకవర్గం అధ్యక్షులు కూనపాము సూర్య, నియోజకవర్గ ఉపాధ్యక్షులు మిర్యాల రవి, కునపాము రాజారత్నం, బొబ్బర చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో పోటీలకు రాజవరం విద్యార్థుల ఎంపిక

కొయ్యలగూడెం: రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు రాజవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఐదుగురు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 29వ తేదీ రాజవరం హైస్కూల్లో అండర్–14, 17 విభాగాల్లో సెలక్షన్స్ నిర్వహించగా వీరిని సెలెక్టర్లు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ఖోఖో ప్రతిభ కనబరిచిన ఎస్డీ షరీఫ్, కె.హేమకాశీ విశ్వేశ్వరరావు, బి.నాగ సౌమ్య, డి.సత్యసాయి, ఒ.వెంకటరమణ ఎంపికయ్యారు.

నిధుల వినియోగంపై వివరణ ఇవ్వండి

కొయ్యలగూడెం: మండల పరిషత్ నిధుల వినియోగంపై సమగ్రమైన దర్యాప్తు చేసి వివరణ ఇవ్వాలని వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన ఎంపీపీ గంజిమాల రామారావు, వైస్ ఎంపీపీ మట్ట వనజా లక్ష్మితో కలిసి పాల్గొన్నారు. మండల పరిషత్ నిధులు తమకు తెలియకుండానే మంజూరు కాబడుతున్నాయని తమ ప్రాదేశిక సెగ్మెంట్‌లలో అమలు అవుతున్న పనులకు తమకు ఏ విధమైన సమాచారం అందజేయడం లేదని, ఎంపీటీసీలు, పలువురు సర్పంచ్‌లు సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆనందోత్సాహాలతో పండుగ చేసుకోండి


బాణసంచా దుకాణాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఆర్డీవో, డీఎస్పీ, తదితరులు

జంగారెడ్డిగూడెం: దీపావళి పండుగను జాగ్రత్తలు పాటిస్తూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని జంగారెడ్డిగూడెం ఇన్‌చార్జి ఆర్డీవో ఎం.ముక్కంటి, డీఎస్పీ యు.రవిచంద్ర అన్నారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను తహసీల్దార్ కె.స్లీవజోజి, మున్సిపల్ కమిషనర్ కేవీ రమణ, ఎస్సై షేక్ జబీర్, అగ్నిమాపక అధికారి జి.అబ్రహం, తదితరులతో కలిసి పరిశీలించారు. ఇన్‌చార్జి ఆర్డీవో ముక్కంటి మాట్లాడుతూ బాణసంచా దుకాణాలను క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. ఇన్‌చార్జి ఆర్డీవో ఎం.ముక్కంటి, డీఎస్పీ యు.రవిచంద్ర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

పొగాకు నర్సరీపై అవగాహన సదస్సు

జంగారెడ్డిగూడెం: మండలంలోని చిన్నవారిగూడెం గ్రామంలో పొగాకు బోర్డు–2 వారి ఆధ్వర్యంలో పొగాకు రైతులకు నర్సరీ అవగాహన సదస్సు నిర్వహించారు. బోర్డు అధికారులు మాట్లాడుతూ రానున్న 2024–2025 సీజన్‌లో క్వాలిటీ పొగాకును పండించాలని సూచించారు. కార్యక్రమంలో బోర్డు ఉన్నతాధికారులు ఎస్‌జీవో ప్రశాంత్, ఫీల్డ్ ఆఫీసర్ రెడ్డి, ఐటీసీ, జీపీఐ, కంపెనీల ప్రతినిధులు, రైతులు మాదాసు సత్యనారాయణ, బండారు వెంకట సుబ్బారావు, ఆళ్ల ప్రకాశం పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడి

చింతలపూడి: మండలంలోని పోతునూరు, మల్లాయగూడెం, ఏసీ అగ్రహారం గ్రామాల్లో పేకాట స్థావరాలపై బుధవారం సీఐ రవీంద్ర దాడులు నిర్వహించారు. దాడుల్లో ఐదుగురిని అరెస్ట్ చేసి రూ.2 లక్షల 500 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్వారకాతిరుమల: మండలంలోని సూర్యచంద్రరావుపేటలో ఒక పేకాట స్థావరంపై బుధవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరు జూదరులను అరెస్టు చేసి, వారి నుంచి రూ. 21,200 లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


పొలం పిలుస్తోంది నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

పోలవరం రూరల్: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు తెలిపారు. మండలంలోని ఇటికిలకోట, వింజరం రైతుసేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

లింగపాలెం: మండలంలోని ధర్మాజీగూడెం, కలరాయనగూడెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లలిత సుధ, వ్యవసాయశాఖాధికారి కె.మురళీకృష్ణ క్షేత్రస్థాయిలో పర్యటించి, రైతులకు యాజమాన్య పద్ధతులపై వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

టి.నరసాపురం: మండలంలోని తిరుమల పేట గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారి బి.సుమలత అధ్యక్షతన పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రైతులు, ప్రజాప్రతినిధులు, సచివాలయం, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

రూ.10 నాణేల చలామణీపై చర్యలు తీసుకోవాలి

కామవరపుకోట: చెల్లుబాటులో ఉన్న రూ.10 నాణేలను కొందరు దుకాణదారులు తీసుకోవటం లేదని, అందరూ తీసుకునేలా చర్యలు తీసుకోవాలని కామవరపుకోట సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ వీరమళ్ల మధు సంస్థ సభ్యులతో కలిసి బుధవారం ఏలూరు కలెక్టర్ కార్యాలయంలో కలెక్టరు వెట్రి సెల్వీకి వినతి పత్రం అందజేశారు.

వైఎస్సార్‌సీపీ నేతకు మాతృ వియోగం

కొయ్యలగూడెం: వైఎస్సార్‌సీపీ మండల అధికార ప్రతినిధి, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు మేకల అన్నవరానికి మాతృ వియోగం కలిగింది. ఆయన తల్లి మేకల లక్ష్మీకాంతం (85) బుధవారం మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అన్నవరం కుటుంబ సభ్యులను తాజా, మాజీ ప్రజా ప్రతినిధులు వివిధ పార్టీల నాయకులు కలుసుకొని సానుభూతి వ్యక్తం చేశారు.

స్ఫూర్తి నింపుతున్న కన్నాపురం యువత

కొయ్యలగూడెం: సేవకు వినూత్నంగా ఆలోచించిన యువత దానిని ఆచరణలో పెట్టి నేటి సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది. కన్నాపురం గ్రామానికి చెందిన యువకులు సమిష్టిగా ఏర్పడి గ్రామానికి దీపావళి వేడుకకు ఒకే బాణసంచా దుకాణాన్ని నాలుగు సంవత్సరాలుగా నిర్వహిస్తూ వచ్చిన లాభాన్ని గ్రామ సంక్షేమం కోసం వినియోగిస్తూ వస్తోంది. దాదాపు ఈ విధంగా రూ.6.5 లక్షల వరకు పొదుపు చేశారు. పొదుపు చేసిన సొమ్ముతో గామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. యువకుల లాభాపేక్ష లేని ఆలోచనలకు గ్రామ పెద్దలు బాణసంచా దుకాణాన్ని ప్రోత్సహిస్తున్నారు.